

1న 'మహా' కౌన్సిల్

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఫిబ్రవరి 1న జరగనుంది. 15 సాధారణ, 89 అనుబంధ అంశాలపై చర్చించనున్నారు. 8లో



క్రీడలతో పోటీతత్వం

సింహాచలంలోని గురుకుల పాఠశాల వేదికగా ఆదివారం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. 10లో



గిరిజన యువత సంఘటితమే లక్ష్యం

8లో

గిరిజన యువత ప్రతిభను వెలికి తీయనున్నట్లు ఏఆర్ విజయరావు తెలిపారు.

న్యూస్‌రీల్

ది రూల్ ... తగ్గేదేలే..!



లొకేషన్‌లో అల్లు అర్జున్

కొమ్మాది: సుకుమార్ దర్శకత్వంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న పుష్ప–2 (ది రూల్) సినిమా విశాఖ పోర్టు తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ఆదివారం అల్లు అర్జున్‌పై పలు ఫైటింగ్ సన్నివేశాలను చిత్రీకరించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ విశాఖలో వచ్చేనెల 7వ తేదీ వరకు జరుగుతుంది.

నేడు జీవీఎంసీ స్పందన

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు ప్రజను అర్జీలు స్వీకరిస్తారు.

కెమికల్ సేఫ్టీ సూపర్‌వైజర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: కెమికల్ సేఫ్టీ సూపర్‌వైజర్ సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. పాలిటెక్నిక్, బీటెక్ చేసిన విద్యార్థులతోపాటు పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఈ విభాగంలో అనుభవం ఉన్న వారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మూడు నెలల వ్యవధి కలిగిన ఈ కోర్సు పూర్తి చేసినవారికి రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ శాఖ (ఎస్‌బీటీఈటీ) సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. వివరాలకు కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు (9912340281), కోర్సు కోఆర్డినేటర్ ఎ.వరహాలు (79015 05682), ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ (9912342065) లను సంప్రదించవచ్చు. ఫిబ్రవరి 28వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



అలా.. నగర వీధుల్లో...



ఒకరు జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్.. మరొకరు రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ విశ్వాంజలి గైక్వాడ్.. వారమంతా ఇద్దరూ బిజీ బిజీగా వృత్తిలో గడుపుతుంటారు. ఆదివారం సాయంత్రం తమ బిజీ లైఫ్‌కు కాస్తా విశ్రాంతి దొరకగానే.. ఈ దంపతులిద్దరూ.. అలా విశాఖపురంలో అంటూ అడుగులో అడుగేస్తూ...వాకింగ్ చేస్తుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. అలాగే జీ–20 సదస్సు నేపథ్యంలో విశాఖ మరింత అందంగా రూపుదిద్దుకుంటోంది. నగరంలోని పలు గోడలపై అందమైన పెయింటింగ్స్ దర్శనమిస్తున్నాయి. బీచ్‌రోడ్డు వద్ద ఇలా వాల్ బ్యాక్‌గ్రౌండ్‌లో యువతులు ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు.

ఫొటోలు :సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

‘ఉక్కు’ సంకల్పంతో ప్రజాగర్జన

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి రెండేళ్లు
- ఆదినుంచీ వైఎస్సార్‌సీపీ మద్దతు
- అలుపెరుగని పోరు సాగిస్తున్న కార్మిక, ఉద్యోగ వర్గాలు
- నేటి గర్జనకు భారీ ఏర్పాట్లు

8లో

ర్యాలీ చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు (ఫైల్)



ప్రజలంటే ఉప్పెన. ప్రజలంటే ఉద్యమం. ఉచ్ఛస్థితి దీని పరిశ్రమం. ఉధృతి దీని పరాక్రమం. ఇందుకు నిదర్శనం విశాఖ ఉక్కు కర్మాగారం.. సమున్నతంగా, సగర్వంగా తెలుగువాడి కంఠిరూపంగా, తెలుగింటి మింటిదీపంగా వెలసింది, వెలిగింది. “కుట్ర అనదగ్గదేదైనా జరిగితే రాజ్యాంగం రాసినకాడే జరిగుండాల” అన్నారో పెద్దాయన. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కూ ఇది వర్తిస్తుందేమో. ప్లాంట్‌కు ఇనప గనులు కేటాయించకుండా తొక్కిపెట్టిన నాడే ప్రైవేటీకరణ దురాలోచన పాలకులకు వచ్చుండొచ్చు. దీన్ని అడ్డుకోడానికి ప్రజలు, కార్మికులు, నాయకులు మళ్లీ పోరుబాట పట్టారు. రెండేళ్లుగా వివిధ రూపాల్లో ఉక్కు కార్మికుల ఆందోళన కొనసాగిస్తున్నారు. ఉక్కు సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

– ఉక్కునగరం

సందడిగా ఎంపీ ఎంవీవీ కుమారుడి వివాహ రిసెప్షన్



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి



శరత్ చౌదరి, జ్ఞానిత దంపతులతో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎంపీ ఎంవీవీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, జీవీ తదితరులు

ఏయూక్యాంపస్: ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు ముళ్లపూడి శరత్ చౌదరి, జ్ఞానిత వివాహ రిసెప్షన్ ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో వైభవోపేతంగా జరిగింది. ఇటీవల వీరికి బెంగళూరులో వివాహం జరిగిన విషయం తెలిసిందే. ఆదివారం నిర్వహించిన వివాహ రిసెప్షన్‌కు స్పీకర్ తమ్మినేని సీతారాం, టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, ఎంపీలు గొడ్డేటి మాధవి, సత్యవతి, నంద్యాల ఎంపీ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, అదీప్‌రాజు, కరణం ధర్మశ్రీ, తిప్పల నాగిరెడ్డి, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ వంశీ కృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, డిప్యూటీ మేయర్ కె.సతీష్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్లు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని నూతన దంపతులకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అందజేశారు.

నేను చదివిన కథలే ప్రేరణ

- రచయిత్రి పొత్తూరు విజయలక్ష్మి
- కథలు, నవలా రచనపై చర్చా గోష్టి



అతిథులను సత్కరించిన రచయితలు, అభిమానులు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): నేను చదివిన కథలే నాకు ప్రేరణ అని, ముఖ్యంగా బీనాదేవి ఏకలవ్య శిష్యురాలిని అని ప్రముఖ హాస్య కథా, నవలా రచయిత్రి పొత్తూరు విజయలక్ష్మి తెలిపారు. నగరంలోని సిరిపురం జంక్షన్లో గల ఓ హోటల్లో ఏర్పాటు చేసిన రచయితలతో ముఖాముఖి, కథలు, నవలా రచనలపై చర్చా గోష్టిలో ఆమె పాల్గొన్నారు. వాస్తవిక పరిస్థితుల్లోని హాస్యాన్ని కుటుంబ కథలకు నేపథ్యం చేసుకుని రాస్తానన్నారు. నవ్వడం, నవ్వించడం తనకు ఇష్టమని, అదే పనిని కథలుగా రాస్తున్నానని తెలిపారు. మరో అతిథి డాక్టర్, హాస్య కథా రచయిత కొచ్చెర్లకోట జగదీష్ మాట్లాడుతూ వృత్తిరీత్యా తాను రోజువారీ చూస్తున్న, ఎదురవుతున్న ఘటనలే తన ప్రధాన కథా వస్తువులన్నారు. తన కథలన్నీ ఆబాలగోపాలం చదివి హాస్యాన్ని ఆస్వాదించేలా ఉంటాయన్నారు. సున్నితమైన అంశాలను ఎంచుకున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అతిథులు అభిమానులు రచయితలను సత్కరించారు. చర్చాగోష్టిలో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, విజయవాడ నుంచి వచ్చిన వచ్చిన రచయితలు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి అచ్యుత్, రుక్మిణి, సునీల్‌కుమార్, మంగ కృష్ణకుమారి, ఏపీ హ్యూమన్ రైట్స్ లీగల్ అడ్వైజర్ వై. హేమలత పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ప్లాట్లకు ఈ వేలం

దొండపర్తి (విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ఖాళీ ప్లాట్ల విక్రయానికి ఫిబ్రవరి 9వ తేదీన ఈ–వేలం నిర్వహిస్తున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కూర్మన్నపాలెం ఫేజ్–1, 2, 6, భీమిలి మండలంలో కుమ్మరిపాలెం లేఅవుట్, చిలుకూరి జాయింట్ వెంచర్, డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్, విజయనగరంలో కనపాక అయ్యన్నపేట హౌసింగ్ కాలనీ ఫేజ్–2 లేఅవుట్లలో నివాస అవసరాలకు అనువైన ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీకి సంబంధించి 28 ప్లాట్లను విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్లాట్లకు సంబంధించిన పూర్తి వివరాలను www.vmrda.gov.inలో పొందుపరిచినట్లు వివరించారు. ఆసక్తి గల కొనుగోలుదారులు ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీలోగా ఈ–పోర్టర్ https://konugolu. ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకొనే విధానంపై అవగాహన లేని వారి కోసం వీఎంఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం 3వ అంతస్తులో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ఆధార్, పాన్‌కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరై సమాచార కేంద్రంలో సేవలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వేడుకగా శారదాపీఠం వార్షికోత్సవాలు



కళాకారులను అభినందిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

- రాజశ్యామల యాగం, ఆంజనేయస్వామికి విశేష అభిషేకం
- పీఠాన్ని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమూర్తి, మంత్రి వేణుగోపాలకృష్ణ



మంత్రి వేణుగోపాలకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం : విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు మూడో రోజు ఆదివారం వేడుకగా జరిగాయి. వేద పారాయణలు, యజ్ఞ యాగాదులతో పీఠం ప్రాంగణం మార్మోగింది. పీఠంలో కొలువుదీరిన దాసాంజనేయస్వామికి ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి విశేషంగా అభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం రుద్ర హోమం, వన దుర్గా హోమాన్ని నిర్వహించారు. లక్ష మూల మంత్రాలతో చేపట్టిన రాజశ్యామల యాగం శాస్త్రోక్తంగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస చదుర్వేద హవనం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా జరిగిన చాత్తాడ శ్రీ వైష్ణవ ఆగమ సదస్సు ఘనంగా ముగిసింది. అర్చక అకాడమీ డైరెక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ సదస్సులను నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు. స్వాత్మానందేంద్ర సరస్వతి చేతులమీదుగా శారదా స్వరూప రాజశ్యామలా స్వరూప చంద్రమౌళీశ్వరులకు నిత్య పీఠార్చన విశేషంగా జరిగింది. కాకినాడకు చెందిన కృష్ణమూర్తి అండ్ బృందం వారిచే మోహినీ భస్మాసుర కూచిపూడి నృత్యం, అన్నమాచార్య సంకీర్తనల ఆలాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రాత్రి రాజశ్యామల అమ్మవారికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మంగళహారతిని సమర్పించారు. వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి సచ్చిదానంద విద్వత్ సభ పేరిట శ్రౌత, శాస్త్ర సభలు జరగనున్నాయి.

పీఠాన్ని సందర్శించిన ప్రముఖులు

వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం పలువురు ప్రముఖులు శారదాపీఠాన్ని సందర్శించారు. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పీఠంలో పూజలు నిర్వహించారు. పీఠాధిపతుల ఆశీస్సులు తీసుకున్నారు. శ్రీకాళహస్తి దేవస్థానం ఈవో సాగర్ బాబు, ఆలయ పండితులు పీఠానికి వచ్చి రానున్న శివరాత్రి వేడుకలకు హాజరు కావాలని స్వామీజీలకు ఆహ్వానం పలికారు. వార్షికోత్సవాల్లో పాల్గొనేందుకు సోమవారం హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంగళవారం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ వస్తున్నట్లు పీఠం ప్రతినిధులు తెలిపారు.

జీవ వైవిధ్యం.. సాహస కృత్యం

- తూర్పు కనుమల పరిరక్షణకు అటవీశాఖ ప్రణాళికలు
- కంబాల కొండలో ప్రయోగాత్మకంగా అమలుకు శ్రీకారం
- బయోడైవర్సిటీ పార్క్, ఆర్కిడేరియం, ఔషదమొక్కల పార్కు ఏర్పాటు
- రూ.90 లక్షలతో మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయం



ప్రకృతి వివరణ కేంద్రం



సిద్ధమవుతున్న ఔషధ వనం



పనులను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

సాక్షి, విశాఖపట్నం : వాతావరణ సమతుల్యతను కాపాడటం, జీవ వైవిధ్యాన్ని పెంపొందించడంలో తూర్పు కనుమలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నైరుతి, ఈశాన్య రుతు పవనాల గమనంలోనూ వీటి పాత్ర ఎంతో కీలకం. మన రాష్ట్రానికి జీవనాడులుగా ఉన్న కృష్ణా, గోదావరి సహా అనేక నదుల్లో నీరు చేరడానికి ఈ పర్వత శ్రేణులు ఎంతగానో దోహదపడుతున్నాయి. అలాంటి తూర్పు కనుమల్లో అటవీ, వన్యప్రాణి సంపద వేగంగా కనుమరుగవుతూ ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి నడుంబిగించింది. మిషన్ కన్జర్వ్ ఈస్టర్న్ ఘాట్స్ పేరుతో జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంతో పాటు సాహసకృత్యాలకు కేంద్ర బిందువుగానూ, వన్యప్రాణులు సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అటవీ శాఖ ప్రత్యేక ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది.

తూర్పు కనుమలు హిమాలయాల కంటే పురాతన పర్వత శ్రేణులు మన రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు విస్తరించి ఉన్నాయి. గత వందేళ్ల కాలంలో ఈస్టర్న్ ఘాట్‌లో 16 శాతం మేర అటవీ సంపద క్షీణించింది. దీన్ని అధిగమిస్తూ కనుమలను పరిరక్షించేందుకు మిషన్ కన్జర్వ్ ఈస్టర్న్ ఘాట్ పేరుతో రాష్ట్ర అటవీ శాఖ నడుంబిగిస్తూ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్స్‌బిలిటీలో భాగంగా రూ.90 లక్షలతో కంబాల కొండలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. విశాఖ నగరం, చుట్టుపక్కల అడవుల్లో పచ్చదనంతో పాటు జీవవైవిధ్యాన్ని పెంపొందించడం.. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం మొదలైన కార్యక్రమాలకు కేంద్రంగా మారుతోంది.

‘ప్రకృతి’ ఒడిలో ‘వివరణ’ కేంద్రం..

సెంట్రల్ నర్సరీలో ప్రస్తుతం ఉన్న భవనం ప్రకృతి వివరణ కేంద్రంగా పునరుద్ధరించనున్నారు. ఇది తూర్పు కనుమలు, కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యంలోని పుష్పజాతులు, జంతుజాలం ఇతర ప్రాణుల గురించి విశదీకరించనుంది. గిరిజనులు, నదులు, పర్యావరణ వ్యవస్థ పనితీరుపై ఆధారపడిన నమూనాలు, తూర్పు కనుమలలోని మడ, సాధారణ అడవులు, గిరిజనుల జాతి–వృక్ష శాస్త్రం మొదలైన వివరాలని అందిస్తుంది. సహజమైన తూర్పు కనుమల పర్యావరణ వ్యవస్థకు సంబంధించిన వాస్తవిక చిత్రాన్ని ప్రదర్శించడానికి చెట్ల ఫెర్న్‌లు, గడ్డి, ఇతర స్థానిక వృక్షజాలంతో ప్రత్యక్ష నమూనా కూడా ఏర్పాటు చేస్తారు. ఏపీలో ఈ తరహా కేంద్రం ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం. తూర్పు కనుమల జీవవైవిధ్యానికి ఎదురవుతున్న ముప్పుపై ప్రజలను చైతన్యవంతులను చేయడమే దీని లక్ష్యం.

అద్భుతాల ఆర్కేడియం

తూర్పు కనుమలలో గ్యాంబుల్, ఫిషర్, మాథ్యూ, హెన్రీ తదితర 66 జాతులకు చెందిన 199 ఆర్కిడ్ జాతులున్నట్లు గుర్తించారు. కీటకాలు, పక్షులు, గబ్బిలాలకు తేనె, పుప్పొడి, పండ్లు, విత్తనాలు వంటి ఆహార వనరులను ఈ ఆర్కిడ్ వృక్షజాతులు అందిస్తాయి. ప్రపంచంలోని 1256 ఆర్కిడ్ జాతులలో 307 భారత్‌కు చెందినవే. తూర్పు కనుమల్లోని కొన్ని ఉష్ణమండల ప్రాంతాలు ఆర్కిడ్‌లకు నిలయంగా ఉన్నాయి. ఈ జాతులను సంరక్షిస్తూ పెంచేందుకు ఆర్కేడియాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆర్కేడియంలో బుల్బోఫిలమ్ వెస్టిటా, హబినారియా పానిగ్రాహియానా, లిపారిస్ పియోని మొదలైన కొన్ని స్థానిక ఆర్కిడ్‌ల మనుగడకు ప్రయోజనం చేకూర్చేలా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేకమైన పుష్పాలను అందించే ఆర్కిడ్‌ల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

సాహసాలతో జీవవైవిధ్య పార్కు

ఆధునికీకరణ ప్రభావంతో జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతున్న తరుణంలో తూర్పు కనుమల్లో వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇందుకోసం బయోడైవర్సిటీ పార్కు ఏర్పాటు చేయనున్నారు. జీవ వైవిధ్య పార్కుతో పాటు కంబాల కొండ సాహస కృత్యాలకు నెలవుగా ట్రెక్కింగ్, ట్రయల్స్‌తో ఫిక్స్‌చరియంని కూడా నిర్మించనున్నారు. ఈ కేంద్రం వాకర్స్‌కు స్వర్గధామంగానూ, అభ్యాసన కేంద్రంగా మారనుంది. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న యానిమల్ రెస్క్యూ సెంటర్ నుంచి తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రం వరకూ యానిమల్ సఫారీ కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో పాటుగా ఇందిరా గాంధీ జూ పార్క్ నుంచి కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం వరకూ వైల్డ్ డాగ్ రీస్టాకింగ్ కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టనున్నారు.

ప్రాజెక్టు : కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యంలో తూర్పు కనుమల జీవవైవిధ్య కేంద్రం
అంచనా వ్యయం : రూ.90 లక్షలు
ఎప్పటిలోగా పూర్తి చేస్తారు : 2023 జూలై
ఎవరు చేస్తున్నారు : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో అటవీ శాఖ

ఏమేం చేయబోతున్నారంటే

ప్రణాళిక	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)
ప్రకృతి వివరణ కేంద్రం	45
ఔషద మొక్కల బృందావనం	20
ఆర్కిడేరియం	20
పోస్టర్లు, పబ్లిసిటీ	05
మొత్తం	90

ఈస్టర్న్ ఘాట్స్‌తోనే మనందరి భవిష్యత్తు..



తూర్పు కనుమల భవిష్యత్తుతోనే మన భవిష్యత్ ముడిపడి ఉంది. రాజీ లేకుండా అడవులను పరిరక్షించాలి. పశ్చిమ కనుమలు, హిమాలయాల మాదిరిగానే తూర్పు కనుమల ప్రాంతం జీవ వైవిధ్యానికి హాట్‌స్పాట్‌గా ఉంది. అందుకే ఈస్టర్న్ ఘాట్స్‌ను సంరక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక వృక్ష, జంతుజాల స్థితిపై సర్వేలను ప్రారంభించి.. వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నాం. విత్తనాల సేకరణ, నర్సరీల పెంపకం, మొక్కల పెంపకాన్ని దత్తత తీసుకోవడం, పెరిగిన జాతులను సమర్థవంతంగా పర్యవేక్షించడం వంటి వివిధ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాం.

– అనంతశంకర్, డీఎఫ్‌వో, విశాఖపట్నం

క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో ఎంపీ ఎంవీవీ కుటుంబ సభ్యులు



శ్రీవారి సన్నిధిలో ఎంపీ కుటుంబ సభ్యులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా శ్రీవారి అంతరాలయంలో పూజలు నిర్వహించారు. తన కుమారుడు శరత్ చౌదరి పెళ్లైన సందర్భంగా తొలిసారిగా నూతన దంపతులను శ్రీవారి దర్శనం కోసం తీసుకుని వచ్చినట్లు తెలిపారు.

పీవీ జీవితం యువతకు ఆదర్శం

హరియాణా గవర్నర్ దత్తాత్రేయ



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ

మద్దిలపాలెం: ఉమ్మడి రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు పీవీ చలపతిరావు మరణం బీజేపీకి తీరని లోటని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. పీవీ చలపతిరావు తనయుడు ఎమ్మెల్సీ మాధవ్ స్వగృహానికి ఆదివారం ఆయన వచ్చి.. పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పీవీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

గోపాలపట్నం: విశాఖలో రెండు రోజుల పర్యటనలో భాగంగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం సాయంత్రం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు పలువురు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఇక్కడి నుంచి రోడ్డు మార్గంలో నగరంలోకి వెళ్లారు.

'ఉక్కు' సంకల్పంతో ప్రజాగర్జన

నేటి గర్జనకు భారీ ఏర్పాట్లు



ఉక్కు ఆందోళనలో కార్మికులు, ఉద్యోగులు పరిరక్షణ కమిటీ సభ్యులు(ఫైల్)

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమం ప్రారంభించి రెండేళ్లు పూర్తయింది. స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం వ్యూహాత్మక అమ్మకం చేయాలని 2021 జనవరి 27న కేంద్ర కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్ కమిటీ నిర్ణయించింది. దీంతో ఉక్కు కార్మిక వర్గం భగ్గుమంది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా పలు ఆందోళనలు నిర్వహించింది. ఢిల్లీలో రెండు రోజులు ధర్నాలు చేపట్టారు. ముఖ్యంగా జాతీయ రహదారిని రెండు రోజుల పాటు దిగ్బంధించారు. స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం ముట్టడి, గేట్ల ముట్టడి చేపట్టారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో పార్లమెంట్‌లో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం వెనక్కు తగ్గేది లేదని తేల్చి చెప్పింది.

ఇందులో భాగంగా అమ్మకాల ప్రక్రియలకు ట్రాన్సాక్షన్, లీగల్ అడ్వైజర్ల నియామకాలు చేపట్టింది. ఉక్కు ఉద్యమానికి బీజేపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, రచయితలు, మేధావులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు మద్దతు ఇస్తూ దీక్షల్లో పాల్గొంటున్నారు. దీక్షలు ప్రారంభించి శనివారం నాటికి రెండేళ్లు పూర్తయింది.

జాతీయ ప్రముఖుల మద్దతు

కఠినమైన మోడీ ప్రభుత్వాన్ని వెనుకకు తీసుకువెళ్లిన ఘనత రైతు ఉద్యమానికి దక్కుతుంది. ఆ రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన రైతు సంఘం నాయకులు రాకేష్ తికాయిత్ విశాఖ వచ్చి ఉక్కు పోరాట కమిటీ ఏర్పాటు చేసిన కార్మిక సభలో విశాఖ ఉక్కు ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. అదే విధంగా ప్రముఖ సామాజిక వేత్త మేధా పాట్కర్ దీక్షా శిబిరం వచ్చి కేంద్ర ప్రభుత్వం వైఖరిని ఎండగట్టారు. ఉద్యమాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవచ్చని తెలిపారు.

నేడు ప్రజా గర్జన...

ఉద్యమంలో రాజకీయ పార్టీలను భాగస్వాములను చేసే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉక్కు త్రిష్ణా మైదానంలో ప్రజా గర్జన ఏర్పాటు చేశారు. బీజేపీ మినహా ఇతర అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించారు. ఈ గర్జనకు వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ, కాంగ్రెస్, జనసేన, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల నాయకులు హాజరవుతారని పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

30 వేలకు పైగా హాజరు..

ప్రజా గర్జనకు సుమారు 30 వేల మంది హాజరవుతారని నాయకులు భావిస్తున్నారు. ఇందు కోసం సుమారు 15 వేల కుర్చీలు ఏర్పాట చేస్తున్నామని తెలిపారు.

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

గర్జనకు హాజరయ్యే వారి వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. అగనంపూడి నుంచి వచ్చే వారికి వీవీవి పాఠశాల మార్గంలో, తెలుగు తల్లి కూడలి నుంచి వచ్చే వారు టౌన్ అడ్మిన్ సబ్ రోడ్డులో, ఉక్కునగరం జంక్షన్ నుంచి వచ్చే వారు సత్యసాయి ఆలయం సమీపంలో తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని కోరారు.

గట్టి బందోబస్తు...

ప్రజా గర్జన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

సత్వరమే పెండింగ్ కేసుల పరిష్కారం



సీపీ నుంచి సర్టిఫికెట్ స్వీకరిస్తున్న ఎస్ఐ హరీష్



మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

దొండపర్తి(విశాఖ దక్షిణ): పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీ-1 సునిత్ సునీల్‌గరుడ్, డీసీపీ(క్రైం) జి.నాగన్న, డీసీపీ-2 కె.ఆనందరెడ్డిలతో పాటు ఏడీసీపీలు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పనితీరును పరిశీలించారు. స్టేషన్ల పరిధిలో పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. అందుకు గల కారణాలను తెలుసుకుని వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలో ఈ నెల క్రైం రేట్ తగ్గిందని, ప్రతి నెలా ఇదే విధంగా పనితీరును ప్రదర్శించాలని సూచించారు.

అనంతరం క్రైం, ట్రాఫిక్ విభాగాల పనితీరును సమీక్షించారు. కోర్టు తీర్పు వెలువరించిన కేసుల వివరాలను తెలుసుకున్నారు. సీనియర్ అధికారులు పోలీస్‌స్టేషన్ల సందర్శనపై ఆరా తీశారు. గత నెలలో విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు పలు కేసులను సత్వరమే ఛేదించిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందించారు.

హత్య కేసు ఛేదించిన పోలీస్ సిబ్బందికి రివార్డులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ వలందపేటకు చెందిన వంక పైడిరాజు హత్య కేసులో తక్కువ సమయంలో నిందితులను పట్టుకున్న ఎస్ఐలు గంటా హరీష్, ఎం.భరత్‌కుమార్‌రాజు, కానిస్టేబుళ్లు ఉమ్మిడి రమేష్, ఇమ్మానుయేలు రాజు, పేరాడ కృష్ణారావులకు సీపీ సీహెచ్ శ్రీకాంత్ సర్టిఫికెట్లు, రివార్డులు అందించారు. గతేడాది డిసెంబర్ 29న పైడిరాజును అతని భార్య జ్యోతి, ఆమె ప్రియుడు వాడమొదలు నూకరాజు, అతని కజిన్ భూలోక హత్యచేసి.. పెదజాలారిపేట శ్మశానవాటికలో దహనం చేసిన సంగతి తెలిసిందే. అదే నెల 30న తన భర్త ఇంటి నుంచి అదృశ్యమయ్యాడంటూ జ్యోతి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయడం.. తర్వాత జరిగిన నాటకీయ పరిస్థితుల్లో పోలీసులకు దొరికిపోయారు. వీరిని ఈ నెల 12న పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు అనంతరం రిమాండ్‌కు తరలించారు.

గిరిజన యువత సంఘటితమే లక్ష్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

- నెహ్రూ యువ కేంద్రం తెలుగు రాష్ట్రాల డైరెక్టర్ విజయరావు
- 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం ప్రారంభం

కొమ్మాది(భీమిలి): దేశం నలుమూలల ఉన్న గిరిజన యువతను సంఘటితం చేస్తూ వారిలో ప్రతిభను వెలికి తీసేందుకు ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం దోహదపడుతుందని నెహ్రూ యువ కేంద్రం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ ఏఆర్ విజయరావు తెలిపారు. గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో ఆదివారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం నిర్వహిస్తున్న ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజన యువతీ, యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజయరావు మాట్లాడుతూ గిరిజన యువతకు కంప్యూటర్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చి, ఉన్నత స్థానంలో నిలబెట్టాలన్నారు. చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. వీరికి వారం రోజుల పాటు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు కూడా ఉంటాయి. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఆశకుమారి, ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, జీవీపీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రజిని, తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతులను ప్రోత్సహించేలా బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రికి ఏపీ చాంబర్స్ లేఖ



పైడా కృష్ణప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచంలో నెలకొన్న అనిశ్చితి, ఆర్థిక మాంద్యం దృష్ట్యా రెండు రోజుల్లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో పరిశ్రమలకు ప్రోత్సాహకాలందిస్తూ.. ఎగుమతులపై దృష్టి సారించాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ తరపున కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం జీఎస్టీ పెనాల్టీ రేట్లను 18-24 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని కోరారు. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు ఎగుమతిదారులకు 50 శాతం ఆటోమేటిక్ బీమా కవర్ ప్రీమియంను కేంద్రం చెల్లించాలన్నారు. ఐటీ పరిమితుల్లోనూ మినహాయింపులివ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌ల చెల్లింపుల కోసం కంపెనీలు ఖర్చు చేసే మొత్తాన్ని కేంద్రం చెల్లించాలన్నారు. డిజిటల్ లావాదేవీలు, గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీలను ప్రోత్సహించాలని కోరారు. గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు పరికరాలను కొనుగోలు చేసే అన్ని యూనిట్లకు 30 శాతం మూల ధన రాయితీ, పన్ను రాయితీ కల్పించాలని కృష్ణప్రసాద్ ఆర్థిక మంత్రిని కోరారు. బ్యాంకు వడ్డీ రేట్లు, ప్రత్యక్ష, పరోక్ష పన్నులు భారీగా తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఝాన్సీ

కూర్మన్నపాలెం: అగనంపూడి తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన సర్వసిద్ధి ఝాన్సీ (23) ఆత్మహత్య చేసుకుంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెందుర్తి సమీపం అక్కిరెడ్డిపాలేనికి చెందిన బంధం రవితో అగనంపూడి తలారివానిపాలెం ప్రాంతానికి చెందిన ఝాన్సీకి ఏడాది కిందట వివాహం జరిగింది. కొద్ది రోజుల తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు మొదలయ్యాయి. వారం రోజుల కిందట ఆమె కన్నవారింటికి వచ్చేసింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నితో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి జయమ్మ ఇంటికి వచ్చి చూసే సరికి కూతురు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో షాక్ గురైంది. స్థానికుల సమాచారంతో దువ్వాడ పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకటో తేదీన 'మహా' కౌన్సిల్

15 సాధారణ, 89 అనుబంధ అంశాలతో అజెండా

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వచ్చేనెల ఒకటో తేదీన జరగనుంది. బుధవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కొత్త సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశంలో 15 సాధారణ, 89 అనుబంధ(సప్లిమెంటరీ) అంశాలపై చర్చించనున్నారు.

- గత కౌన్సిల్ సమావేశంలో వాయిదా పడిన జోన్-6 గాజువాక పరిధిలో తుంగ్లాం గ్రామంలో కల్వర్టు ఏర్పాటుకు భూమి కేటాయించాలని వచ్చిన అభ్యర్థనపై చర్చ జరగనుంది.
- జోన్-1 పరిధి 8వ వార్డు తారకరామ లేఅవుట్‌లో కమల్ టవర్ నుంచి ఈపీ నంబరు 257/ఏ/5 వరకు బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు రూ.98 లక్షలతో అంచనాను రూపొందించారు.
- జోన్-2 పరిధి 12వ వార్డులో పెద్దగదిలి జంక్షన్ నుంచి చిన్నగదిలి కూడలి వరకు సిమెంట్ కాంక్రీట్ టెర్రాజో/ప్రీ-పాలిష్డ్ చెకర్డ్ టైల్స్‌తో ఫుట్‌పాత్‌ను రూ.59.40 లక్షలతో పునర్నిర్మాణంపై చర్చించనున్నారు.
- 12వ వార్డు హెల్త్ సిటీ లేఅవుట్‌లో ఎంఎస్ఎఫ్-1కి ఎదురుగా ఉన్న రీ-క్రియేషనల్ ఏరియా వద్ద రూ.54.69 లక్షలతో ఎంఎస్ చైన్ లింక్డ్ మెస్‌తో ఫెన్సింగ్ ఏర్పాటుకు, వాకింగ్ ట్రాక్, సిట్టింగ్ బెంచీలతో ఓపెన్ సైట్ అభివృద్ధికి పరిపాలన అనుమతి కోసం చర్చకు రానుంది.
- జోన్-2 పరిధి 11వ వార్డు ఆరిలోవ దుర్గాలమ్మ గుడి వద్ద ఉన్న జీవీఎంసీ కల్యాణ మండపాన్ని రూ.192 లక్షలతో 1000 మంది సామర్థ్యంతో పునర్నిర్మాణంపై చర్చించనున్నారు. అలాగే ముస్తాఫా కాలనీ మసీదుకు ఆనుకుని ఆరిలోవ ఎఫ్ఆర్‌యూ ప్రాంగణంలో రూ.54.90 లక్షలతో జీ+1 తరహాలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి అంచనాలు రూపొందించారు.
- టౌన్ ప్లానింగ్ ఎస్టేట్ వింగ్ ఎండాడ గ్రామం సర్వే నంబరు 179/1పీలోని కొంత భాగంలో 0.50 ఎకరాలు ఏపీ స్టేట్ యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదలాయింపునకు సంబంధించి చర్చ జరగనుంది. పెదగంట్యాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నైపుణ్య విద్యా సంస్థ ఏర్పాటుకు భూబదలాయింపునకు సంబంధించి చర్చించనున్నారు.
- భూముల రీసర్వే ప్రాజెక్టు, జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కోసం కార్పొరేషన్ ఫండ్ నుంచి డీడీవో అకౌంట్ ఆఫ్ సీ అండ్ డీఎంఏకు రూ.270.25 లక్షలు బదిలీ చేయు విషయమై చర్చకు రానుంది.
- అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న నలుగురు హార్టికల్చరిస్టుల వేతనాలు రూ.27 వేల నుంచి రూ.42,011 పెంచేందుకు చర్చించనున్నారు.

సప్లిమెంటరీ అంశాలు

- సర్దార్ వల్లభాయ్ పటేల్(పూర్ణామార్కెట్) మార్కెట్‌ను పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో పునరాభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతికి పంపేందుకు చర్చించనున్నారు.
- 15వ ఆర్థిక సంఘం 2022-23 ఏడాదికి మిలియన్ ప్లస్ నగరాలు, ప్రతిపాదిత పనులపై మాట్లాడనున్నారు.
- జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో షిర్డీ సాయి వెటర్నరీ కాలనీలో యూజీడీ పైపులైన్ పొడిగింపునకు చర్చించనున్నారు.
- గాజువాక-అగనంపూడిలో సర్వే నంబరు 102/1ఏలో రైతుబజార్ ఏర్పాటుకు భూమి మంజూరు విషయమై చర్చకు రానుంది.
- ఒప్పంద పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు కొనుగోలు విషయమై 2022-23 ఏడాదికి అవసరమయ్యే రూ.1,24,98,309 అంచనా వ్యయాన్ని కమిషనర్ తీసుకున్న నిర్ణయంపై చర్చించనున్నారు.
- జీ-20 సదస్సు విశాఖలో మార్చి 28, 29 తేదీల్లో జరుగుతున్న నేపథ్యంలో జోన్-5 పరిధిలోని ఎన్‌హెచ్-16 కూడలి నుంచి తాటిచెట్లపాలెం కూడలి మీదుగా రైల్వేక్లబ్ కూడలి వరకు రోడ్డుకు ఇరువైపులా రహదారుల సుందరీకరణ, అలాగే జ్ఞానాపురం హిందూ శ్మశానవాటిక నుంచి రైల్వేస్టేషన్ మీదుగా తెలుగుతల్లి వంతెన వరకు ఉన్న రహదారులు థెర్మోప్లాస్టిక్ రోడ్డు మార్కింగ్ పెయింటింగ్, జీబ్రా క్రాస్ పెయింటింగ్, ఫుట్‌పాత్ నిర్మాణాల విషయమై చర్చకు రానుంది.
- జీ-20 సదస్సులకు సంబంధించి చినముషిడివాడ కూడలి నుంచి పెందుర్తి కూడలి వరకు, ఎన్ఏడీ కూడలి నుంచి గోపాలపట్నం కూడలి వరకు, గోశాల కూడలి నుంచి అడవివరం వరకు, గోపాలపట్నం నుంచి పెందుర్తి వరకు, వేపగుంట నుంచి చినముషిడివాడ వరకు, గోపాలపట్నం పెట్రోల్ బంక్ నుంచి వేపగుంట కూడలి వరకు బీటీ రహదారుల పునరుద్ధరించేందుకు చర్చించనున్నారు.
- నోవాటెల్ హోటల్ పరిసర ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, సుందరీకరణ, పందిమెట్ట జంక్షన్, నౌరోజీరోడ్డు, నేవీ హౌస్ కూడలి వరకు రోడ్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు చేపట్టేందుకు చర్చకు రానుంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణం

వరకట్న వేధింపులే కారణం!



సౌజన్య(ఫైల్)

సింహాచలం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెందుర్తి మండలం దువ్వపాలెంలో చోటుచేసుకుంది. పెందుర్తి సీఐ అప్పారావు తెలిపిన వివరాలివీ.. హైదరాబాద్‌కు చెందిన సౌజన్య(26)కి, శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన హనుమంతు గిరిప్రసాద్‌తో 8 నెలల కిందట వివాహం జరిగింది. మూడు నెలల కిందట వీరు దువ్వపాలెంలో ఇళ్లు కొనుగోలు చేసి నివసిస్తున్నారు. గిరిప్రసాద్ నగరంలోని ఓ ఆస్పత్రిలో దంత వైద్యుడిగా పనిచేస్తున్నాడు. సౌజన్య అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. వర్క్ ఫ్రమ్ హోం ద్వారా విధులు నిర్వర్తిస్తోంది. వీరి వివాహం సమయంలో సౌజన్య తండ్రి విష్ణు..గిరిప్రసాద్‌కు 6లక్షల నగదు, 13 తులా ల బంగారం ఇచ్చారు. అయినా తరచూ డబ్బులు తీసుకురావాలని సౌజన్యతో గిరిప్రసాద్ గొడవపడేవాడు. మద్యం సేవించి ఇంటికి వచ్చేవాడు. శనివారం సాయంత్రం గిరిప్రసాద్ విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చూసే సరికి సౌజన్య ఉరివేసుకుని ఉంది. ఈ విషయాన్ని సౌజన్య తల్లిదండ్రులకు తెలిపాడు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరకట్నం వేధింపుల కింద కేసు నమోదు చేసి సీఐ అప్పారావు, ఎస్ఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

పోర్టుల ప్రైవేటీకరణను అడ్డుకుందాం



అసోసియేషన్ చైర్మన్ బంగారు రాజును సన్మానిస్తున్న పెన్షనర్లు

మద్దిలపాలెం: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ పరిశ్రమలైన పోర్టులను ప్రైవేటీకరించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. దీనిని పోర్టు పింఛన్‌దారులందరూ అడ్డుకోవాలని పోర్టు మాజీ ట్రస్టీ బీసీహెచ్ మసేను పిలుపునిచ్చారు. 51వ వార్డు మాధవధార తోటలో ఆదివారం వారంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. పింఛన్‌దారులందరికీ ఆస్పత్రి సౌకర్యాలు ప్రైవేట్‌పరం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో రెండు కోట్లకు పైగా ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారని.. కానీ దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రానున్న రోజుల్లో పింఛన్లు కూడా వచ్చే అవకాశం లేదన్నారు. అనంతరం హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారు రాజును ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు, ప్రధాన కార్యదర్శి శివప్రకాష్‌రావు, సలహాదారులు అన్నెపు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

గౌరమ్మ సంబరాలకు వెళ్లి వస్తుండగా ఘటన



కుటుంబ సభ్యులతో ఉమా మహేశ్వరీ(ఫైల్)



ఘటనా స్థలంలో మృతురాలు ఉమామహేశ్వరి

సబ్బవరం: ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై సబ్బవరంలోని పాతరోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వివాహిత అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెందుర్తికి చెందిన విల్లూరి రాజుకు భార్య ఉమా మహేశ్వరి(30), కుమార్తెలు వైష్ణవి, కీర్తి నిహారిక ఉన్నారు. ఉమామహేశ్వరి తల్లిదండ్రులది అనకాపల్లి. రాజు తన భార్యాపిల్లలతో అనకాపల్లిలో జరుగుతున్న గౌరమ్మ సంబరాలకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. సంబరాలు చూసుకుని తిరిగి ఆదివారం పెందుర్తి వస్తున్నారు. సబ్బవరంలోని పాతరోడ్డు వద్దకు వచ్చేసరికి వెనకనే వస్తున్న లారీ ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న నలుగురూ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. ఉమా మహేశ్వరి తలకు బలమైన గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. చిన్న కుమార్తె కీర్తికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఎస్ఐ ఎల్.సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని.. ఉమా మహేశ్వరి మృతదేహాన్ని అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కీర్తికి సబ్బవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. రాజు ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.